క్లుప్తంగా

నిందితులకు రిమాండ్

జడ్చర్ల: మండల పరిధిలోని బూరెడ్డిపల్లి గ్రామ శివారులో జరిగిన భూతగాదా కేసులో నిందితులు రోజా, కేశవులును శుక్రవారం అరెస్ట్ చేశారు. సీఐ రమేశ్‌బాబు మాట్లాడుతూ ..వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

భూత్పూర్ : కర్వెన వద్ద శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో బోలేరో, మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రంగా గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం మేరకు.. కర్వెనకి చెందిన హన్మంత్‌రెడ్డి మోటర్ సైకిల్‌పై గ్రామానికి వస్తుండగా, ఎదురుగా వస్తున్న బోలేరో ఢీకొంది. దీంతో హన్మంత్‌రెడ్డి గాయపడ్డాడు. గ్రామస్తులు అతడి వెంటనే ఆటోలో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వివరించారు.

18 గొర్రెలు చోరీ

మిడ్జిల్: వల్లభ్‌రావుపల్లిలో గురువారం రాత్రి ఇప్పలపల్లి పర్వతాలుకు చెందిన 11, మ్యాకల మల్లయ్యకు చెందిన 7 గొర్రెలు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధితులు శుక్రవారం మిడ్జిల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ సమీపంలోని గొర్రెల దొడ్ల వద్ద ఘటన చోటుచేసుకుందని వాపోయారు. మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

భూమి ఇవ్వాలంటూ వ్యక్తిపై దాడి

మహమ్మదాబాద్: తమకు రావాల్సిన భూమి ఇచ్చేయాలంటూ ఓవ్యక్తిపై మరొకరు దాడికి పాల్పడిన ఘటన గండేడ్ మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చిన్న వార్వాల్‌కి చెందిన హన్మంతుకు అదే గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి పట్టాపొలంలో కొంత భాగం రావాల్సి ఉందన్న విషయంపై పంచాయితీ నడుస్తోంది. అయితే భాస్కర్‌రెడ్డి ప్రభుత్వ సర్వే పెట్టుకోవాలని... ఒకవేళ సర్వే ద్వారా భూమి వచ్చేది ఉంటే ఇచ్చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పగా శుక్రవారం ఉదయం సైతం విషయంపై ఇద్దరి కుటుంబాల మధ్య వివాదం సాగింది. కోపోద్రిక్తుడైన హన్మంతు భాస్కర్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనపై దాడిచేసి గాయపర్చాడు. విషయంపై బాధితుడు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ పోలీసులు తెలిపారు.

క్రషర్ ఏర్పాటు నిలిపివేయండి

నవాబుపేట: చౌడూర్ శివారులో పంట పొలాల మధ్య ఏర్పాటు చేస్తున్న క్రషర్‌ను నిలిపివేయించాలని రైతులు కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందించారు. అలాగే నిషేధిత మందుగుండు సామగ్రిని క్రషర్ వారు వాడటంతో తమ పెంపుడు కుక్కలు వాటి ప్రమాదంలో మృతి చెందాయని పేర్కొన్నారు. క్రషర్ నిర్మాణం కోసం అనుమతి విషయంలో రైతుల అభిప్రాయాన్ని తీసుకోవాలన్నారు. ఏర్పాటు కోసం పంచాయతీ అనుమతి ఇవ్వలేదని అన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. రైతులు మల్లేష్, భీమయ్య, వెంకటేష్, అమరేష్ ఉన్నారు.

స్థలం కాపాడాలని వినతి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: భగీరథకాలనీలో సెప్టిక్‌ట్యాంకు స్థలాన్ని కొందరు ఆక్రమించుకోవడానికి యత్నిస్తున్నారంటూ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.బి. మధు సూదన్, ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు, కోశాధికారి జి.వెంకట్రామిరెడ్డి తదితరులు ఆరోపించారు. శుక్రవారం అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌కు ఫిర్యాదు చేశారు.

నిరుపయోగంగా సూచిక బోర్డు

మాగనూర్: మండలంలోని పూంజనూర్ గ్రామానికి వెళ్లే దారికి గేటు వద్ద ఏర్పాటుచేసిన సూచిక బోర్డుపై ఎటువంటి పేర్లనమోదు చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందికారంగా మారింది. పూంజనూర్ గ్రామానికి మూడమాల్, కోల్పూర్‌నుంచి వచ్చే ప్రజలకు సరైన సూచిక బోర్డులేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఈ దారి గుండా వెళ్లేవారు ఏ గ్రామానికి ఎటు వెళ్లాలనేది ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు సూచిక బోర్డుపై గ్రామం పేరు రాయించాలని కోరుతున్నారు.



కోయిల్‌కొండలో మాట్లాడుతున్న డీఈఓ రవీందర్



పీయూలో గణిత దినోత్సవం



వాగ్దేవీ కళాశాలలో..

రామానుజన్ సేవలు మరువలేం

సాక్షినెట్‌వర్క్: జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి(జాతీయ గణిత దినోత్సవం) ఘనంగా నిర్వహించారు. రామానుజన్ సేవలు మరువలేమని గణిత ఉపాధ్యాయులు, అధ్యాపకులు కొనియాడారు.

పాలమూరు యూనివర్సిటీలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. రిజిస్ట్రార్ గిరిజా హాజరై ప్రసంగించారు. ఓయూ అధ్యాపకులు హరిసింగ్ నాయక్, రవీందర్‌రెడ్డి, నాగరాజు, మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని వాగ్దేవీ జూనియర్ కళాశాలలో అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, ఐఐటీ–నీట్ అకాడమీ ఇన్‌చార్జ్ పావని, వైస్‌ప్రిన్సిపాల్ జ్యోతినందన్‌రెడ్డి, కోట్లశివకుమార్, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కళాశాలలో ..

ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, హెచ్‌ఓడీ విజయలక్ష్మి, రాజేశ్వరీ, రవళి, రమేష్‌రెడ్డి, సురయ్య జబీన్ తదితరులు పాల్గొన్నారు.



మహమ్మదాబాద్‌లో రామానుజన్ సంఖ్య ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

ట్రస్మా ఆధ్వర్యంలో..

ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాత డీఈఓ కార్యాలయంలో ఉన్న శ్రీనివాసరామానుజన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ట్రస్మా అధ్యక్షుడు ప్రభాకర్, హరినాథ్, సురేందర్, సాహెబ్‌హుస్సేన్, శ్రీనివాసులు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్ మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాలలో గణితంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సురేష్‌కు రూ. 500 బహుమతి అందించారు.

గండేడ్ పరిధిలోని రుసుంపల్లి, వెన్నాచేడ్, గండేడ్, కొండారెడ్డిపల్లి, బల్సుగొండ, సల్కర్‌పేట్ తదితర గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గణిత దినోత్సవం నిర్వహించారు.

బాదేపల్లి జెడ్పీ హైస్కూల్, కోడ్గల్ జెడ్పీ హైస్కూల్, స్వామినారాయణ గురుకుల పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. వ్యాసరచన, ఉపన్యాస, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

పదోతరగతి విద్యార్థుల సిలబస్‌ను పూర్తి చేసి పరీక్షలకు సిద్ధం చేయాలని జిల్లా విద్యాధికారి రవీందర్ అన్నారు. శుక్రవారం కోయిల్‌కొండ, పారుపల్లి ఉన్నతపాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలల్లో గణిత దినోత్సవాల్లో మాట్లాడారు. ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్‌నాయక్, హెచ్‌ఎంలు విజయమ్మ, వెంకటాజీ తదితరులు పాల్గొన్నారు.



రుసుంపల్లిలో..



బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో..



స్వామినారాయణ్ గురుకుల్‌లో..

కారుణ్య నియామకాలు చేపట్టాలి

జడ్చర్ల టౌన్: రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హౌసింగ్ కార్పొరేషన్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం కలిశారు. టైమ్‌స్కేల్‌పై పనిచేస్తున్న వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కాగా సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.

సముచిత స్థానం కల్పించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ ముస్లిం రిజర్వేషన్ల సాధన ఉద్యమంలో, మలిదశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకపాత్ర పోషించారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి.ఇష్రత్‌అలీ అన్నారు. ఆయనకు రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ పదవి ఇచ్చి గౌరవించాలని కోరారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అయూబ్, కోశాధికారి ఖాజా జైనుల్లాఅబెదిన్, కార్యదర్శి సిరాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలి



కోయిల్‌కొండ: గ్రామపంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. శుక్రవారం చందాపూర్, అయ్యవారిపల్లి, అంకిళ్ల గ్రామాల్లో ఆయన పర్యటించారు. నర్సరీలను ఆయన పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఏపీఓ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో స్వస్థత ఫౌండేషన్ వారు బీడీ కార్మికులకు, మహిళలకు క్యాన్సర్ అవగాహన కల్పించడంతో పాటు.. ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 50 మంది మహిళలకు పరీక్షలు చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కృష్ణ హాజరయ్యారు. తంబాకు, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఫౌండేషన్ అధినేత డాక్టర్ చతుర్వేది, డీఆర్‌డీఓ పీడీ యాదయ్య, అదనపు పీడీ శారద, చిన్నచింతకుంట వైద్యాధికారి డాక్టర్ రాహుల్, తెలంగాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. యాదగిరి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఇస్త్రంపల్లి రోడ్డు

అడ్డాకుల: మండలంలోని పెద్దమునుగల్‌ఛేడ్ నుంచి దేవరకద్ర మండలం ఇస్త్రంపల్లి వరకు ఉన్న మట్టి రోడ్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు గ్రామాల మధ్యన సరైన దారి లేదు. పెద్దమునుగల్‌ఛేడ్ నుంచి ఇస్త్రంపల్లి వరకు సుమారు 2.5కిలో మీటర్ల దూరం ఉంది. రెండు గ్రామాల మధ్యన ఉన్న పెద్దవాగులో వాహనాలు దాటే పరిస్థితి లేకపోవడంతో చుట్టు తిరిగి రావాల్సి వస్తోంది. కొత్తగా ఏర్పాటైన కొకుంట్ల మండల కేంద్రం, దేవరకద్రకు వెళ్లడానికి అడ్డాకుల, వనపర్తి జిల్లాలోని పెద్దమందడి మండలాల ప్రజలకు ఇదే దగ్గరి దారి. అయితే సరైన రోడ్డు సౌకర్యం లేనందున పొన్నకల్, నందిపేట మీదుగా దేవరకద్రకు, రాచాల మీదుగా కొకుంట్లకు వెళ్తున్నారు. దీనివల్ల పది కిలోమీటర్లకు పైనే అదనంగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. అదేవిధంగా కొకుంట్లలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులకు సైతం ఇబ్బందులు కలుగుతుండడంతో.. తప్పనిసరై అటు మదనాపురం, ఇటు మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్లకు వెళ్తున్నారు. గతంలో పెద్దమునుగల్‌ఛేడ్ నుంచి ఇస్త్రంపల్లి వరకు బీటీరోడ్డు నిర్మాణం కోసం రూ.1.50కోట్లు మంజూరు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. దాంతో పాటు వాగులో బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.18కోట్లు మంజూరు చేయాలని కూడా ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. ఈ దారిని బీటీరోడ్డుగా మారిస్తే అడ్డాకుల మండలానికి రెండు మండలాలతో దగ్గరి దారి అవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పెద్దమునుగల్‌ఛేడ్, ఇస్త్రంపల్లి రోడ్డు దుస్థితి

గతంలోనే ప్రతిపాదనలు



పెద్దమునుగల్‌ఛేడ్, ఇస్త్రంపల్లి గ్రామాల మధ్యన బీటీ రోడ్డు నిర్మాణం, దాంతో పాటు రెండు గ్రామాల మధ్యన ఉన్న వాగులో బ్రిడ్జి నిర్మాణం కోసం గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. మరోసారి తాజా అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం.

–వేణుగోపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ, అడ్డాకుల

రేణుక ఎల్లమ్మ ఆలయంలో అన్నమయ్య సంకీర్తనలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం ప్రముఖ ఆధ్యాత్మిక గాయకులు గద్వాల చంద్రశేఖరరావుతోపాటు శిష్యబృందం అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. చంద్రశేఖరరావు మాట్లాడుతూ ప్రతి ఆలయంఓ అన్నమయ్య వాణి లలిత సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

నవాబుపేట: ఆలయాల అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామని డీసీసీ అధికార ప్రతినిధి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సోదరుడు దుశ్యంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం దేశ్యానాయక్‌తండాలో ఆంజనేయ స్వామి ఆలయానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం యన్మన్‌గండ్ల సమీపంలో నిర్మించ తలపెట్టిన అయ్యప్ప ఆలయ స్థలాన్ని పరిశీలించారు. మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, ఆంజనేయులు, కుమార్, భాస్కర్‌నాయక్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

చిరు ధాన్యాల సాగుపై అవగాహన

దేవరకద్ర: చిరు ధాన్యాల సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దేవరకద్ర మండలం బస్వాయపల్లి గ్రామంలో నాబార్డు సహకారంతో ఐకార్ ఐఐఎమ్‌ఆర్ శాస్త్రవేత్తలు రైతులకు పలు రకాల చిరు ధాన్యాలను పండించే విధానాల గురించి ఈ సందర్భంగా వివరించారు. అదే విధంగా పరిశుభ్రతపై సూచనలు చేశారు. ఉచితంగా చిరు ధాన్యాల ప్యాకెట్లను అందజేశారు. శాస్త్రవేత్తలు శ్రీనివాసబాబు, సంగప్ప, రఫీ, సీఈఓ సతీష్, అరవింద్, రవిందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చేయకుండా వేధింపులు

- సీనియర్ అసిస్టెంట్ చర్యలతో కన్నీరు పెట్టుకున్న సిబ్బంది
- రాజాపూర్ పీహెచ్‌సీలో ఘటన

రాజాపూర్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంట్ యశ్వంత్ అక్కడ సిబ్బంది బిల్స్ చేయకుండా వేధింపులకు గురిచేస్తున్నాడని అక్కడే పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఏ శమీమ్‌బేగం శుక్రవారం కన్నీరు మున్నీరయ్యారు. వచ్చే మార్చ్‌లో రిటర్మెంట్ ఉందని ఎన్నో పర్యాయాలు సంబంధిత పీహెచ్‌సీ వైద్యులు మదుసూదన్‌కు విన్నవించినా లాభం లేకపోయిందని వాపోయారు. పీహెచ్‌సీలో పనిచేసే సిబ్బంది ఎఫ్‌టీఏ బిల్స్, యునిఫామ్ అలవెన్స్, సరెండర్, మెడికల్ తదితర కొన్ని బిల్స్ కొన్ని నెలలుగా చేయడం లేదని ఆరోపించారు. కాగా యశ్వంత్‌పై సిబ్బందిని ఇబ్బందుల పాలు చేస్తున్నాడని.. చేయి తడిపిన వారికి మాత్రం బిల్స్ చేస్తున్నాడన్న ఆరోపనలు వెల్లువెత్తుతున్నాయి. విషయంపై పీహెచ్‌సీ వైద్యుడు మధుసూదన్‌ను వివరణకోరగా తనకు రావాల్సిన బిల్లులు కూడా చేయలేదని... సిబ్బంది తన దృష్టికి వారి సమస్యలను కూడా తీసుకువచ్చారని అన్నారు. విషయంపై జిల్లా మెడికల్ అండ్ హెల్త్ అధికారికి లిఖిత పూర్వకంగా నివేదిక ఇచ్చామని వివరించారు.



బిల్లులు చేయడంలేదని రోదిస్తున్న శమీమ్‌బేగం

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

జడ్చర్ల టౌన్: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనం కోసం పట్టణంలోని ప్రసిద్ధ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం తెల్లవారుజామున స్వామికి పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ, పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నారు. వేలాదిమంది భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ఆలయ ప్రాంగణంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉత్తర ద్వారం శుద్ధిచేసి ఎదురుగా భక్తులకు కనువిందు చేసేలా స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. మండలంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలోనూ వేడుకలు జరగనున్నాయి.



జడ్చర్లలో ఏర్పాట్లు

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి గుట్ట సమీపంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం ఉత్తర ద్వార ప్రవేశం కల్పిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని వివరించారు.

ఫీజులు తగ్గించాలని నిరసన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీజీ కోర్సుల ఫీజులు తగ్గించాలని కోరుతూ స్వేరో ఆధ్వర్యంలో పీయూ గేట్ వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ సాధారణ ఫీజులతో పాటు అదనపు ఫీజులు వసూలు చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సమ్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రూప్‌సింగ్, సురేందర్, భద్రు, శ్రావణి, హరి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వరకవుల దుర్వాసరాజుకు పురస్కారం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన సీనియర్ నాటకరంగ కళాకారుడు వరకవుల దుర్వాసరాజు నటరత్న ఎన్టీఆర్ పురస్కారం అందుకున్నారు. తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో గురువారం రాత్రి సుబ్బరాజు నాట్య కళాపరిషత్ 60వ వార్షికోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరాణిక నాటకాల్లో వివిధ పాత్రలు పోషించి ఉత్తమ అభినయం చేసినందుకు గానూ ఆ సంస్థ పురస్కారం అందజేసి సత్కరించింది.

అలరించిన సెమీ క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో చిన్నారుల ప్రదర్శనలు



కేక్‌కట్ చేస్తున్న అతిథులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం వెంకటేశ్వర కాలనీలోగల డ్యూరో కిడ్స్ ప్లే స్కూల్‌లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అలగల ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు ఎ.టైటస్ రాజేందర్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కల్వరి ఎంబీ మాజీ వైస్ చైర్‌పర్సన్ ఎస్‌ఎస్.మేరిడేవిడ్ పాల్గొని క్రీస్తు జననం విశిష్టత గురించి ప్రసంగించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌరి, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పకు ఘనంగా అభిషేకం

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో ఘనంగా అయ్యప్ప అభిషేక పూజ నిర్వహించారు. హరిప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. గురుస్వాములు శ్రీనివాస్, రాజశేఖర్ సమక్షంలో పటం పూజ చేపట్టారు. అనంతరం అభిషేకం, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. బాలు, లక్ష్మీకాంత్‌రెడ్డి, గోపాల్, బాల్‌రాజ్, శ్రీనివాస్, గోవర్ధన్, నర్సిములు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



కనుల పండువగా ఊరేగింపు



బాలానగర్: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని మండలపరిధిలోని పెద్దరేవల్లి, మోతీఘణాపూర్, గౌతాపూర్, ఉడిత్యాల, చిన్నరేవల్లి గ్రామాల్లో భక్తులు ఆలయాలకు పోటెత్తారు. గౌతాపూర్‌లోని గుట్టపై వెలసిన శ్రీ విజయ లక్ష్మీనర్సింహ స్వామిని వైకుంఠ ద్వారం నుంచి వందలాది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కనుల పండువగా సాగింది. ప్రధాన అర్చకులు హరి బాలానందదాసు స్వామివారి ఆధ్వర్యంలో సహస్రనామ హోమం నిర్వహించారు. అనంతరం లక్ష్మీసమేత స్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. శనివారం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు.

